మానిని

రావి. ఎస్. అవధాని

''నీ పేరేమిటమ్మా!'' అన్నారు వర్ధనమ్మగారు వత్తులు నలుపుతూ.

''జ్యోతి! శివజ్యోతి'' అంది ఆ అమ్మాయి వినయంగా.

''వంట చేయగలవా?'' ఆ అమ్మాయిని ఆపాదమస్తకం ఓ పర్యాయం చూసి అడిగారు.

''పిండి వంటలూ, టిఫిన్లూ కూడా చేయగలనండీ!'' అంది ధైర్యంగా.

''నాలుగు రోజులుండి వెళ్లిపోతానని అనవుకదా!'' అన్నారు చిరునవ్వుతో.

''అననండి. వుంటాను'' అంది నమ్మకంగా.

''సన్నమ్మా!'' అంటూ కేకవేసేరు వర్ధనమ్మగారు.

పనిమనిషి సన్నమ్మ లోపలినుండి గబగబా వచ్చింది. సన్నమ్మకు 50 ఏళ్ళుంటాయి. సన్నంగా, పొడవుగా వుంటుంది, చామనఛాయ.

''ఈ అమ్మాయి జ్యోతి. నాకు పని సాయం చేయడానికి వచ్చింది. గెస్టురూమ్‌లో వుంటుంది. తీసుకుని వెళ్లు. కాళ్ళూ చేతులూ మొహం కడుక్కోమను. ఇల్లూ, వంట గదీ చూపించు'' అన్నారు.

''రండమ్మాయిగోరూ. ఆ సంచీ ఇటివ్వండి'' అంది.

''ఫర్వాలేదు పద'' అంటూ ఆమె వెంట నడిచింది.

గెస్టురూమ్ కడిగినట్లుంది. గదిలో ఒక బల్ల, మంచం, దాని మీద పరువూ బెడ్‌షీట్, దిండూ వున్నాయి. సీలింగ్ ఫేనుంది. కిటికీలోంచి చల్లని గాలి వీస్తోంది. గది గోడకు నిలువెత్తు అల్మెరా వుంది. ఒక తలుపుకి మిర్రర్ వుంది. ఆల్మెరాలో రెండు బెడ్‌షీట్లూ, టవల్, టాయ్‌లెట్ సామాన్లూ వున్నాయి. ఎటాచ్‌డ్ బాత్రూమ్ వుంది.

''అందల సామాన్లు తవరికోసం ఎట్టినవేనండి. పెందిల గది కడిగేనండి'' అంది సన్నమ్మ.

జ్యోతి తన బేగ్ ఆల్మెరాలో వుంచి టవల్, సోపూ తీసుకుని వెళ్లి కాళ్లూ, చేతులు, ముఖం కడుక్కుని వచ్చింది.

సన్నమ్మ ఇల్లంతా జ్యోతికి చూపించింది.

మేడమీద మూడు బెడ్‌రూమ్స్, ఒక డ్రాయింగ్ రూమ్, ముందూ వెనుకా విశాలమైన బాల్కనీలున్నాయి. క్రింద గెస్టురూమ్‌తో నాలుగు బెడ్‌రూమ్స్, కిచెన్, డైనింగ్ హాల్, పూజా మందిరం, డ్రాయింగ్ రూమ్ వున్నాయి. ఇంటి చుట్టూ విశాలమైన పెరడూ అందులో కొబ్బరి, మామిడి, జామ, అరటి చెట్లూ, పూల మొక్కలూ ఉన్నాయి.

''అమ్మాయిగోరూ! టీ ఎడతారా? పాలు ఫ్రిజ్జిల వుంటాయి'' అంది సన్నమ్మ.

''ఎంతమందికి?''

''ఎందరంతే పెద్దమ్మగోరూ, సాత్తుల్లుగోరూ'' అంటూ వేళ్ళు లెక్కపెట్టి ''సేతుడుమంది'' అంటూ ఐదు వేళ్ళు చూపించింది.

సన్నమ్మ కిచెన్ గుమ్మం వద్ద నిలబడి ఏ సామాన్లు ఎక్కడ వుంటాయో చెప్పింది. జ్యోతి టీ కలిపి రెండు కప్పులు ట్రేతో తెచ్చి టీపాయ్ మీద వుంచింది. వర్ధనమ్మగారూ, శాస్త్రిగారూ చెరో కప్పు తీసుకున్నారు.

వర్ధనమ్మగారు టీ కొద్దిగా రుచి చూసి ''చాలా బాగుందమ్మా టీ'' అంది మెచ్చుకోలుగా.

''టీ నువ్వూ, సన్నమ్మా తీసుకుని వాచ్‌మెన్ రంగయ్యకు కూడా ఇవ్వు'' అన్నారు.

ఆవిడ చెప్పినట్లే చేసింది జ్యోతి.

వర్ధనమ్మగారి వయస్సు 60 సంవత్సరాలు. ఆమె భర్త వాసుదేవరావుగారు సివిల్ సర్జన్‌గా పని చేసి రిటైర్ అయి నాలుగు ఏళ్ళక్రితం పోయారు. వారి కుమారుడు విజయ్, కోడలు నళిని ఇద్దరూ గవర్నమెంట్ హాస్పటల్లో డాక్టర్స్. వారికిద్దరు కొడుకులు. పెద్దవాడు వాసు 6 సంవత్సరాలు, రెండోవాడు బంటీ నాలుగు సంవత్సరాలు. ఇద్దరూ కాన్వెంట్‌లో చదువుతున్నారు.

వర్ధనమ్మగారు పూర్వకాలం మనిషి అయినా ఆవిడకు ఎక్కువగా చాదస్తంలేదు. మడీ, తడీ, ఆచారం పాటిస్తారుగానీ అవన్నీ ఉదయం ఆవిడ పూజలు ముగిసేవరకే. అయితే ఉదయం పూట ఆవిడకు పని వొత్తిడి చాలా ఎక్కువ. ఉదయం ఎనిమిదిన్నర గంటలకు మనవలిద్దరూ టిఫిన్ తిని కొద్దిగా టిఫిన్ లంచ్ బాక్సుల్లో పెట్టుకుని కాన్వెంట్‌కి వెళతారు. మరలా 1 గంటకు తిరిగి వస్తారు. అప్పుడు వారికి భోజనం పెట్టాలి. ఉదయం తొమ్మిదిన్నర గంటలకు కొడుకు, కోడలూ భోజనం చేసి టిఫిన్ బాక్సులు తీసుకుని డ్యూటీకి వెళ్లి సాయంత్రం ఆరుగంటలకు వస్తారు.

అందువల్ల ఆవిడ ఉదయాన్నే పూజా కార్యక్రమం పూర్తి చేసుకుని 8 గంటలకు టిఫిన్, తొమ్మిది గంటలకు వంటా పూర్తి చేయాలి. పిల్లలిద్దర్నీ స్కూల్‌కి రెడీ చేసి పంపేవరకూ నళినికి వీలవదు అత్తగారికి సాయం చేయడానికి. తరువాత ఆమె రెడీ అయ్యేసరికి ఇక టైమ్ వుండదు. సాయంత్రం అలసి వచ్చిన కోడలిని చూసి ఆమెకు ఏ పనీ చెప్పలేకపోతున్నారు వర్ధనమ్మగారు. ఆవిడకు వంట పని చేయడానికి తైనాతుగా ఇంట్లో వుండడానికి ఒక పిల్లను పెట్టుకోవాలనుకుని ఆ విషయం శాస్త్రిగారికి చెప్పారు. శాస్త్రిగారు ఎంతో ప్రయత్నించి చివరకు ఆయన తమ్ముడు పై ఊర్నించి జ్యోతిని తీసుకువచ్చారు.

జ్యోతికి 16 సంవత్సరాల వయస్సు. పసిమి ఛాయ. ముఖంలో మంచి కళ ఉంది. కడిగిన ముత్యంలా వుంటుంది.

''పని చక్కగా చేస్తుందండీ. నెమ్మదస్తురాలు. ఒకప్పుడు ఎంతో బాగా బ్రతికినవాళ్ళే. తల్లీ తండ్రీ ఏక్సిడెంట్‌లో పోయేరుట'' అన్నారు శాస్త్రిగారు.

శాస్త్రిగారికి ఖర్చులకుగాను వంద రూపాయలిచ్చి వారిని పంపేరు వర్ధనమ్మగారు.

రాత్రి వంట వర్ధనమ్మగారే చేసింది. ఆవిడకు వెనుక సాయం చేసింది జ్యోతి.

మర్నాడుదయం జ్యోతి 5 గంటలకే లేచి స్నానం వగైరాలు పూర్తిచేసి కాఫీ ఫిల్టర్ వేసింది. పూజ గది శుభ్రం చేసి పూజ సామాగ్రి రెడీ చేసింది. కిచెన్‌లో సామాన్లు నీట్‌గా సర్ది పెట్టింది. వర్ధనమ్మగారు బ్రష్ చేసుకుని వచ్చేసరికి ఆవిడకు కాఫీ కలిపిచ్చింది.

''అప్పుడే స్నానం కూడా చేసేసేవా తల్లీ'' అన్నారు చిరునవ్వుతో.

ఆ రోజు రెండు పూటలా జ్యోతి చేతి వంటా, టిఫిన్ తిని ఎంతో మెచ్చుకున్నారు వర్ధనమ్మగారు.

నాలుగు రోజుల్లో ఇంటి పనంతా అలవాటైంది జ్యోతికి.

''పెద్దమ్మగోరూ! అంటే దిస్టి తగల్తదిగానండీ. జ్యోతమ్మగోరు సక్కదనాల సుక్కండీ. ఏ కన్నతల్లి బిడ్డో సిదివి దీపపెట్టుగోచ్చండి. శానా పనిమంతురోలు గదండీ. ఒక్కసుట్టు సెవితే సాలండి ఏ పనైనా సిటికెలో గెహించి సేస్తన్నారు గదండీ'' అంది సన్నమ్మ.

''నిజమేనే చేతిలో పని అందుకుని మరీ చేస్తోంది. ఏ పని చేసినా ఎంతో నీట్‌గా చేస్తోంది. అసలు నన్ను ఏ పనీ చెయ్యనివ్వడంలేదు. చూస్తున్నావుకదా'' అన్నారు.

''పోనీ సెయ్యనియ్యండమ్మా. తవకి కొంత తెరిపి అవుద్ది'' అంది.

సన్నమ్మ ఉదయం ఆరుగంటలకు వచ్చి 11 గంటలకు వెళ్లి మరలా మూడుగంటలకు వచ్చి సాయంత్రం ఆరువరకూ వుంటుంది. ఆమె భర్త రంగయ్య వాచ్‌మె

న్గా ఆ ఇంటివద్దనే పని చేస్తున్నాడు.

వర్ధనమ్మగారు కొడుకు, కోడలు, మనవల గురించి, వారి అలవాట్లు, అభిరుచులూ జ్యోతికి చెప్పారు. వాళ్ళు ప్రస్తుతం సౌత్ టూర్‌కి వెళ్లారని నాలుగు రోజుల్లో వస్తారని చెప్పారు.

అనుకున్న విధంగానే వారు నాలుగో రోజు ఉదయాన్నే వచ్చారు. సన్నమ్మ, వాచ్‌మెన్ వారి సామాన్లు లోనికి తెచ్చేసరికి జ్యోతి ట్రేతో రెండు కప్పుల కాఫీ, రెండు గ్లాసులతో హార్లిక్స్ తెచ్చి టీపాయ్ మీద వుంచింది. విజయ్, నళిని కాఫీ త్రాగారు.

వాసూ, బంటీ ఇద్దరూ వాళ్ల నాయనమ్మ ఒడిలో కూర్చుని కబుర్లు చెబుతున్నారు. వర్ధనమ్మగారు కొడుకూ, కోడల్నీ కుశలప్రశ్నలు వేసి మనవలతో కబుర్లలో పడ్డారు.

విజయ్, నళిని ఆవిడను జ్యోతి గురించి అడగాలనుకుని ఆవిడవేపు ప్రశ్నార్థకంగా చూసారు. అయితే ఆవిడ పిల్లలతో బిజీగా వుండడంవల్ల తరువాత తీరుబడిగా తెలుసుకోవచ్చునుకుని మేడమీదకు వెళ్లిపోయారు.

జ్యోతి పిల్లలిద్దరికీ చెరొక గ్లాసూ హార్లిక్స్ అందించింది. వాళ్ళు సందేహంగా ఆవిడవేపు చూసారు.

''తీసుకోండి. అక్క'' అంటూ వారికి పరిచయం చేసారు. వాళ్ళు జ్యోతివైపు చూస్తూ హార్లిక్స్ త్రాగారు.

''వాసూ, బంటీ మీరిద్దరూ గుడ్‌బోయిస్ కదా. మరి ఇప్పుడు ఫస్ట్ స్నానం చేసి డ్రెస్ చేసుకుని టిఫిన్ చేయడానికి నా దగ్గరకు వస్తారో చూద్దాం. రెడీయేనా!'' అంది జ్యోతి.

''అప్పుడే కాదు, వుండు'' అంటూ వాళ్ళు వెంటనే కాళ్లకున్న షూస్ , సాక్స్ వూడపెరికి వాటిని ఓ మూలకు విసిరేసి ఇద్దరూ లైన్‌గా నిలబడి ''ఆ...రెడీ'' అన్నారు.

జ్యోతి ''వన్...టూ...త్రీ'' అనగానే ఇద్దరూ మేడమీదకు పరుగెత్తారు.

''మెల్లగా వెళ్లండిరా. పడగలరు'' అన్న వర్ధనమ్మగారి మాటలు వారు వినిపించుకోలేదు.

జ్యోతి వాళ్ళ జోళ్ళూ, సాక్స్‌తీసి రేక్‌లో పెట్టి కిచెన్‌లోనికి వెళ్లింది.

కోడలు పిల్లలను గదమాయించి వెంట తరిమితేగానీ స్నానానికి వెళ్లని వాళ్ళు జ్యోతి మాట విని అలా పరిగెత్తేసరికి వర్ధనమ్మగారు ఆశ్చర్యపోయారు.

పదినిముషాల్లో పిల్లలు స్నానం చేసి డ్రెస్ వేసుకుని తయారై ఇద్దరూ ఒకే టైమ్‌లో డైనింగ్ హాల్లో అడుగు పెట్టి—

''అక్కా! నేనే ఫస్ట్ స్నానం చేసాను'' అన్నాడు బంటీ.

''కాదు అక్కా. నేనే ఫస్ట్. కావలిస్తే మమ్మీని అడుగు. మమ్మీ నా డ్రెస్ తొందరగా తీసివ్వలేదు. వాడికే డ్రెస్ ముందిచ్చింది'' అన్నాడు వాసు బుంగమూతి పెట్టి.

''ఈ రూమ్‌లోకి మీరిద్దరూ ఒక టైమ్‌లో వచ్చారు. ఇద్దరూ ఈ రోజు ఫస్ట్'' అంది జ్యోతి నవ్వుతూ.

ఆమె అలా అనగానే వారి ముఖాలు వికసించాయి.

కొడుకూ, కోడలూ క్రిందకు రావడంతో వర్ధనమ్మగారు డైనింగ్ హాల్లోకి వచ్చారు. పిల్లలు పేచీలు పెట్టకుండా పొందికగా కూర్చుని ఆ అమ్మాయితో కబుర్లు చెప్తూ టిఫిన్ చేయడం చూసి ముగ్గురూ ఎంతో ముచ్చటపడ్డారు.

వర్ధనమ్మగారు జ్యోతి గురించి కొడుకూ, కోడలుకి చెప్పారు.

''ఆ అమ్మాయి నన్ను ఏ పనీ ముట్టుకోనివ్వడంలేదు. మంచి పనిమంతురాలు. చేసే పని నీట్‌గా చేస్తోంది. నిముషం తీరిగ్గా కూర్చోదు. ఇల్లంతా ఎంత చక్కగా సర్ది పెట్టిందో చూసేరా'' అన్నారు.

నిజమే. ఇంట్లో సామాన్లు డెకరేటివ్‌గా అమర్చబడ్డాయి.

లంచ్‌కి దోసకాయపప్పు, గుత్తి వంకాయ కూర, కొబ్బరి చట్నీ, రసం, మిరియం వడలు, సేమ్యాపాయసం చేసి డైనింగ్ టేబులుమీద వుంచింది జ్యోతి.

ఆ రోజు డ్యూటీ ఆఫ్ కనుక లంచ్‌కి అంతా ఒకే పర్యాయం వచ్చారు. డైనింగ్ టేబుల్‌మీద వున్న ఐటమ్స్ చూడగానే విజయ్ కళ్ళు సంతోషంతో మెరిసాయి. అతనికి మిరియం వడలు, సేమ్యాపాయసం ఎంతో ఇష్టం.

వర్ధనమ్మగారు వడ్డన చేస్తూ జ్యోతిని కూడా వారితో భోజనానికి కూర్చోమన్నారు. కానీ ఆమె తరువాత తింటానంది.

''నాన్నమ్మా! ఈ రోజు డాడీ బర్త్‌డేనా?'' అన్నాడు బంటీ.

''కాదురా. ఎందుకని?'' అన్నారు.

''మరి ఇవెందుకు చేసావు?'' అంటూ వడలూ, పాయసంవైపు చూపించాడు.

వర్ధనమ్మగారు ఫకాలున నవ్వారు.

''అవీ నా కొడుక్కి ఇష్టం. అందుకని'' అన్నారు.

''మరైతే నాకేమిటి ఇష్టం?'' అన్నాడు బంటీ.

''నీకు ఏది ఇష్టమో నువ్వే చెప్పాలి. చెప్పు'' అంది జ్యోతి.

''నాకూ...నాకూ కిట్‌కేట్ ఎంతో ఇష్టం'' అన్నాడు బంటీ ఉత్సాహంగా.

''పేమ్...పేమ్...ఎగతాళి చేసాడు వాసు.

''ఎందుకూ? నాకు అవే ఇష్టం'' అన్నాడు బంటీ మొండిగా.

''అవి చెప్పకూడదు. బూర్లూ, జిలేబీలు, వడలు అని చెప్పాలి'' అన్నాడు వాసు.

''అయితే నాకు ఇవే ఇష్టం'' అంటూ ప్లేట్‌లో వడ తీసి



టెలీఫోన్

అలగ్జాండర్ గ్రాహమ్‌బెల్ టెలీఫోన్‌ను కనిపెట్టిన పిమ్మట అనేకమంది ప్రముఖులు, వ్యాపారవేత్తల ముందు టెలీఫోన్‌ను ప్రదర్శించి, అది పనిచేసే విధానాన్ని వివరించాడు. తర్వాత కొద్దిరోజులకు మోర్గాన్ అనే వ్యాపారవేత్త గ్రాహమ్‌బెల్‌కు ఒక ఉత్తరం వ్రాశాడు!

''నేను, నా వ్యాపార భాగస్తులు, మీరు కనిపెట్టిన టెలిఫోన్ ప్రదర్శనను చూసి ఆనందించాం. అదొక ఆసక్తి కలిగించే కొత్తరకం సాధనం అయినప్పటికీ, వ్యాపార పరంగా దానికి భవిష్యత్తులేదు. ఆ సాధనాన్ని అమ్మకానికి పెడితే, నష్టపోవడమే తప్ప, లాభాలను పొందడం అసంభవం!''

ఆ జాబు చదివి, చిరునవ్వు నవ్వి మౌనంగా ఉండిపోయాడు బెల్. ఆ తర్వాత కొంతకాలానికి టెలీఫోన్ ఖ్యాతి నలుదిశలా విస్తరించి, ఆ టెలీఫోన్ వ్యాపారం మూడు పువ్వులూ ఆరు కాయలు అయిన గ్రాహమ్ బెల్‌కు ఇబ్బడిముబ్బడిగా ధనాన్ని ఆర్జించి పెట్టింది. అది అందరికీ నిత్యావసరమైంది! ఇది చూసి పాపం మోర్గాన్ తన తొందరపాటు నిర్ణయంతో, బెల్‌కు ఆవిధంగా లేఖ వ్రాసినందుకు ఎంత సిగ్గుపడ్డాడో, ఏమో!

జనం

1998లో రాకీ మౌంటెన్ నేషనల్ పార్క్‌ను సందర్శించడానికి 3.26 మిలియన్ల జనం వచ్చారు. ప్రపంచంలోని ఏ అపురూపమైన ప్రదేశాన్ని చూడడానికి అంతమంది జనం ఎప్పుడూ రాలేదట.

- కొడిమెల

చూపించి తినబోయాడు.

''ముందు అన్నం తిని తరువాత అవి తినాలి. నువ్వు ఇవి తింటే మరి అన్నం తినవు'' బంటీ చేతిలోని వడ తీసి ప్లేట్‌లో వుంచింది నళిని.

''ఫస్ట్ పప్పూ అన్నం, కూర అన్నం, రసం అన్నం తిని తరువాత ఇవి తినాలి కదూ మమ్మీ'' అన్నాడు వాసు.

''అవన్నీ ఫస్ట్ తింటే నా పొట్ట నిండిపోతుంది. మరి ఇవి తినడానికి ప్లేస్ వుండదు'' అన్నాడు బంటీ దిగులుగా.

''సరే. అన్నం తింటూ మధ్యలో వడ కొద్దికొద్దిగా తిను'' అంది జ్యోతి.

బంటీకి ఈ సజెషన్ నచ్చింది.

''పిల్లలకి వడ్డన నేను చూస్తాను. మీరు నిదానంగా భోజనం చేయండి'' అని జ్యోతి పిల్లల మధ్యన నిల్చుని వారికి కావాల్సినవి వడ్డిస్తూ వాళ్ళతో కబుర్లు చెప్పడంతో వారు పేచీలు మాని తొందరగా భోజనం చేసారు.

''ఐటమ్స్ అన్నీ ఎంతో రుచిగా చేసావు'' అని మెచ్చుకుంది నళిని.

జ్యోతి వాచ్‌మెన్ రంగయ్య ద్వారా తోటకూర, గోంగూర, బచ్చలి, బెండ విత్తనాలు తెప్పించి పెరట్లో మళ్ళు కట్టి పిల్లలచేత వేయించి వారికి గార్డెన్ వర్క్‌లో ఇంట్రెస్టు కలిగించింది. వారు నాటిన బెండ కాపుకు రావడంతో పిల్లల ఆనందానికి ఇక అంతేలేదు. వాళ్ళు తమ ఫ్రెండ్స్‌కు చూపించారు.

పిల్లలిద్దరూ జ్యోతికి ఎంతో చేరికయ్యారు. వారిని ఉదయాన్నే నిద్రలేపి 8 గంటలకల్లా తయారుచేసి స్కూలుకి పంపడం, మరలా 1 గంటకు వారికి లంచ్ పెట్టడం, పెద్దవాళ్ళకి 9 గంటలకు లంచ్ రెడీచేసి డైనింగ్ టేబుల్‌పై వుంచి వారి టిఫెన్ బాక్సులు రెడీ చేయడం, పిల్లలచేత స్కూల్ హోంవర్క్ చేయించి చదివించడం లాంటి పనులన్నీ చకచకా ఎంతో ఓర్పుతో నేర్పుగా చేస్తోంది.

ఆమె వచ్చిన నెలరోజులకే ఇంట్లో వచ్చిన మార్పుకు అందరూ ఆశ్చర్యపోయారు. నళినికి ఉదయం పూట ఎంతో రిలీఫ్‌గా వుంటోంది. పిల్లలు అసలు దేనికీ పేచీలు పెట్టడంలేదు. ఒకరితో ఒకరు పోటీ పడడం లేదు. తమ పనులు చేసుకుంటున్నారు.

ఇంట్లో కన్నెపిల్ల కలవిడిగా అటూ ఇటూ మసలడం వర్ధనమ్మగారికి కన్నుల పండుగగా వుంది.

జ్యోతికి పట్టుచీరలతో నాలుగు జతల బట్టలు కుట్టించి ఇచ్చారు. పెద్దవాళ్ళకు ఆమె చేసే వంటకాలూ, పిల్లలకు ఆమెచేసే రకరకాల టిఫెన్స్ బాగా నచ్చాయి.

నెలాఖర్న జ్యోతికి జీతం ఎంతివ్వాలనే సందేహం వచ్చింది వర్ధనమ్మగారికి. ముందుగా జీతం విషయం ఏమీ నిర్ణయించుకోలేదు. శాస్త్రిగారు కూడా ఏమీ చెప్పలేదు. కోడలిని పిల్చి అడిగారు.



ఆమెకూడా ఏమీ చెప్పలేక ''ఆ అమ్మాయినే పిల్చి అడి మీరే నిర్ణయించండి'' అంది నళిని అత్తగారితో.

జ్యోతిని పిలిచి అడిగారు వర్ధనమ్మగారు.

''నాకెందుకమ్మా జీతం. మీరు ఎంతో అభిమానంతో నన్ను మీ ఇంట్లో ఉండనిచ్చి భోజనం, కాఫీ టిఫిన్ పెడుతున్నారు. బట్టలు కుట్టించి ఇచ్చారు. అంతకన్నా ఇంకేం కావాలి నాకు'' అంది నవ్వుతూ.

''అదికాదమ్మాయ్. మీవాళ్ళకెవరికైనా డబ్బు పంపడానికి...''

''డబ్బు పంపాల్సిన వాళ్ళు నాకెవరూ లేరమ్మా'' అంది బొంగురుపోయిన గొంతుకతో. కన్నీళ్ళు వర్ధనమ్మగారికి కన్పించకుండా ముఖం పక్కకు తిప్పుకుంది.

వర్ధనమ్మగారి గుండె కలుక్కుమంది. వెంటనే ఆవిడ జ్యోతిని అక్కున చేర్చుకుని ఓదార్చింది.

''పిచ్చితల్లీ! మేమంతా నీవాళ్ళం కామా? ఊరుకో'' అన్నాడు ఎంతో అభిమానంతో. ''అనవసరంగా నీ మనస్సు నొప్పించాను'' అని బాధపడ్డారు.

ఒకరోజు నళిని సాయంత్రం ఇంటికి వచ్చేటప్పుడు ఐదువందలు పెట్టి చక్కటి పాలరాతి రాధాకృష్ణుల విగ్రహం కొని తెచ్చింది. ఆ రోజు రాత్రి కో-డాక్టర్ మేరేజ్ రిసెప్షన్ ప్రెజెంటేషన్ కొరకు. ఆ విగ్రహం కోసం ఆమె చాలా షాపులు తిరిగి కొంది. అత్తగారికి చూపించి పేక్ చేద్దామనుకుంది. వర్ధనమ్మగారు దానిని చూసి ఎంతో మెచ్చుకున్నారు. ఆవిడ జ్యోతిని పిలిచి దానిని ఆమెకిచ్చి నీట్‌గా పేక్ చేయమన్నారు.

జ్యోతి విగ్రహాన్ని తీసుకుని రెండడుగులు వేసేసరికి బంటీ పరుగు పరుగున వచ్చి జ్యోతి వెనుక నుండి డేష్ ఇచ్చాడు. ఆమె కాస్త పరాకుగా ఉండడంతో ముందుకు తూలి పడి ఆమె చేతిలో బొమ్మ నేలమీద పడి ముక్కలైంది.

మేడమీదకు వెళ్ళబోయిన నళిని ఆ దృశ్యం చూసింది. కోపం పట్టలేక బంటీ రెక్క పట్టుకుని వీపుమీద రెండు దెబ్బలు వేసింది. వాడు ఏడుపు మొదలుపెట్టాడు.

''పొరపాటు నాదేనండీ. బంటీని కొట్టకండి'' అంటూ వాడిని నళిని చేతినుండి విడిపించబోయింది జ్యోతి.

''అడ్డమైన వాళ్ళనూ నెత్తిన ఎక్కించుకుంటే ఇలానే వుంటుంది మరి. ఎవళ్ళని మాత్రం ఏమనగలం!'' అంటూ కొడుకుని మేడమీదకు ఈడ్చుకుని వెళ్ళింది నళిని.

వర్ధనమ్మగారు ఏమో అనబోయి తమాయించుకున్నారు. ఆవిడ తేరుకుని లేచి వెళ్ళి నేలమీద పడ్డ ముక్కలను తీయబోయారు. అయితే జ్యోతి ఆవిడను వారించి అక్కడ క్లీన్ చేసింది.

నళిని పది నిముషాల్లో తయ్యారై పిల్లల్ని కూడా తయారుచేసి క్రిందకు తీసుకువచ్చింది.

పిల్లలిద్దరూ ''అక్కా టాటా! నాన్నమ్మా టాటా'' అని చేతులూపారు.

''చాలు. నోరు మూసుకుని నడవండి'' అని వారిని గదమాయించి కార్లో వారిని వెంట తీసుకుని వెళ్ళిపోయింది.

విజయ్ వెన్యూకి డైరెక్ట్‌గా వస్తానన్నాడు.

రాత్రి వర్ధనమ్మగారు భోజనం చేయగానే జ్యోతి ఏమీ తినకుండా డైనింగ్ టేబుల్ సర్ది తన గదిలోకి వెళ్ళి పడు

కుంది. అంతా గమనించిన వర్ధనమ్మగారి మనస్సు గాయపడింది.

రోజూ ఉదయం వర్ధనమ్మగారు బ్రష్ చేసుకునేసరికి జ్యోతి ఆవిడ ముందు కాఫీ కప్పుతో ప్రత్యక్షమయ్యేది. అయితే ఈ రోజు ఉదయం ఆమె అలికిడి లేకపోయేసరికి ఆవిడకు గత సాయంత్రం సంఘటన గుర్తుకొచ్చి ఏదో ఆందోళనతో ''అమ్మా జ్యోతీ!'' అంటూ కిచెన్‌వద్దకు వెళ్లి చూసారు. ఆమె కిచెన్‌లోనూ, డైనింగ్ హాల్లోనూ లేదు. పెరట్లో చూసారు. లేదు.

వాచ్‌మెన్ పాలకేన్ తెచ్చి ఆవిడ ముందుంచాడు.

వర్ధనమ్మగారు పాల కేన్ కిచెన్‌లో పెట్టి కాఫీ ఫిల్టర్ వేసారు. అనుమానంతో జ్యోతి గదిలోకి వెళ్లారు. ఆమె మంచంమీద ముడుచుకుని పడుకుంది. దగ్గరకు వెళ్లి ఒంటిమీద చెయ్యివేసి చూసారు. ఒళ్ళు కాలిపోతోంది. ఆవిడ వెనుతిరిగేసరికి–

''అక్కా! నేను ఫస్ట్ బ్రష్ చేసుకొచ్చాను. హార్లిక్స్ నాకే ముందు ఇవ్వు'' అంటూ బంటీ సుడిగాలిలా వచ్చాడు. వాడి వెనుకనే వాసూ కూడా పరుగు పరుగున వచ్చాడు.

''అక్క ఎందుకు ఇంకా పడుకుంది నాన్నమ్మా?'' అన్నాడు బంటీ.

''అక్కకి జ్వరం. గొడవ చేయక బయటకు పదండి'' అని ఆవిడ మేడ మెట్ల వద్దకు వెళ్లి ''విజయ్! విజయ్'' అని కేకవేసి ''వాసూ! వెళ్లి మీ డాడీని పిల్చుకునిరా'' అన్నారు.

''ఇదేం ఖర్మరా బాబూ. ఎంతో కలవిడిగా ఇల్లంతా తిరిగే పిల్ల ఇలా అయిందేం? అసలు కన్నెపిల్లలు ఇంట్లో మసలడం అచ్చిరాదేమిటో'' అంటూ దిగులు చెందారు వర్ధనమ్మగారు.

వారి వంశంలో అప్పటివరకూ ఎవరికీ ఆడపిల్ల పుట్టలేదు. ఆరు తరాల అనంతరం వర్ధనమ్మగారికి తొలిచూలు ఆడపిల్ల పుట్టింది. వాసుదేవరావుగారు తన కూతురికి లలిత అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచారు. ఆమెకు 12 ఏళ్ళ వయస్సు వచ్చాక వర్ధనమ్మగారికి విజయ్ పుట్టాడు. లలిత చదువుల్లోనూ, ఆట పాటల్లోనూ ఫస్టే. తండ్రి ఆమెకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడంతో ఎవరినీ లక్ష్యపెట్టక మొండిగా తయారైంది. తల్లి మాట అసలు వినేదికాదు. వర్ధనమ్మగారు పలుమార్లు భర్తను హెచ్చరించారు 'కూతుర్ని అంత ముద్దు చేయడం మంచిది కాదని'. కానీ ఆయన ఆవిడ మాట వినలేదు.

వాసుదేవరావుగారు కూతురి వివాహం ఎంతో వైభవంగా చేయాలని లక్ష రూపాయల విలువగల బంగారు నగలు చేయించి లాకర్‌లో వుంచారు. కూతురు పేర రెండు లక్షల నగదు బ్యాంక్‌లో వేసారు.

ఒకరోజు లలిత, ఒక యువకుడు పూలమాలలతో ఇంటికి వచ్చేసరికి వాసుదేవరావుగారూ, వర్ధనమ్మగారూ షాక్ అయ్యారు.

''డాడీ! ఈయన ప్రతాప్. నా క్లాస్‌మేట్. మనవాళ్ళే. ఈయనకు ఫాదర్, మదర్, తోబుట్టువులూ ఎవ్వరూ లేరు. మేమిద్దరం ప్రేమించుకున్నాం. పెళ్లి చేసుకున్నాం. మమ్మల్ని ఆశీర్వదించండి'' అంది లలిత ధైర్యంగా.

వర్ధనమ్మగారు కోపం పట్టలేకపోయారు.

''ఏమిటే నీ పొగరు? ఎంత తెగింపు. నిన్ను కన్న తల్లిదండ్రులం మాతో ఒక్కమాట చెప్పకుండా పెళ్లి చేసుకున్నావా? ఏ ముఖంతో మా ముందుకొచ్చావ్? పో బయటకు. జన్మలో మళ్లీ నా కళ్లపడొద్దు. చూసారుగా మీరిచ్చిన ఫ్రీడంవలన మీ కూతురుచేసిన ఘనకార్యం. అసలు మీ వంశానికేదో కన్నెశాపం వుంది. ఆడపిల్లల అచ్చటా ముచ్చటా చూసే యోగం లేదందుకే. ముందు దాన్ని బయటకు పొమ్మనండి. లేకుంటే నా శవాన్ని చూస్తారు మీరు'' అన్నారు వర్ధనమ్మగారు ఎంతో ఆవేశంతో.

వాసుదేవరావుగారు ఏమో చెప్పబోయారు.

''పదండి. ఇంకా ఎందుకిక్కడ?'' అని లలిత భర్త చేయి పట్టుకుని విసురుగా వెళ్లిపోయింది. ఆమె జాడ నేటివరకూ తెలియలేదు.

''ఏమైందమ్మా?'' అంటూ విజయ్ వచ్చి జ్యోతి పల్స్ చూసాడు.

''ఫీవర్ చాలా ఎక్కువగా వుందమ్మా'' అని వెంటనే ఇంజెక్షన్ చేసాడు.

''తప్పంతా నాదే. బంటీని కొట్టకండి'' అని పలువరిస్తోంది జ్యోతి.

బంటీ అల్మారాలో వున్న కార్డు సైజ్ ఫోటో ఫ్రేమ్‌తో వున్నదానిని తీసి ''నాన్నమ్మా ఇందుకో అక్క చూడు'' అంటూ వర్ధనమ్మగారికి ఇచ్చాడు.

ఆవిడ ఫోటో చూసి షాకయ్యారు.

జ్యోతి తల్లిదండ్రులతో కలసి తీయించుకున్న ఫోటో అది.

''చూడరా విజయ్! చూడు. ఈ జ్యోతి ఎవరో కాదురా'' అంటూ కొడుక్కి ఫోటో అందించి దుఃఖం ఆపుకోలేకపోయారు.

''లలితక్క'' అన్నాడు విజయ్. అతను ఇంటర్ చదువుతున్నప్పుడు లలిత ప్రతాప్‌ని పెళ్లి చేసుకుని ఇంట్లోంచి వెళ్లిపోయింది.

''ఏం జరిగింది అత్తయ్యా?'' అంటూ నళిని వచ్చింది.

''ఇంకేం జరగాలి? నా చేతి గోరుముద్దలు తినాల్సిన నా చిట్టితల్లి తన చిట్టి చేతులతో మనందరికీ ఇన్నాళ్ళూ గోరు ముద్దలు తినిపించిందమ్మా. నువ్వు తూలనాడినట్లు ఈ పిల్ల అడ్డమైన వాళ్లూ కాదమ్మా. నా సొంత మనవరాలు. లక్షల ఆస్తిని కాలదన్ని కట్టుకున్న వాడివెంట కట్టు బట్టల్తోవెళ్లిన అభిమానవంతురాలు నీ ఆడపడుచు కూతురు.

ఏం శాపమో కళ్ల ముందున్న నా చిట్టి తల్లి వాళ్ళమ్మ పోలికలు కొట్టొచ్చిన విధంగా వున్నా నేను గుర్తించలేక పిల్లదాని చేత ఇన్నాళ్ళూ చాకిరీ అంతా చేయించాను'' అంటూ జ్యోతిని ఒడిలోకి తీసుకున్నారు వర్ధనమ్మగారు.

★

'అబు బాగ్దాద్' ఆగిపోయిందా?





మెగాస్టార్ చిరంజీవి 'అబుబాగ్దాద్' ఇంగ్లీషు చిత్రం దాదాపు మధ్యలో ఆగిపోయినట్లేనండీ! ఇదే విషయాన్ని ప్రెస్‌మీట్ పెట్టిమరీ ఆ చిత్ర నిర్మాతలు చెప్పారు. చిరంజీవికి కూడా రాన్రాను ఆ సినిమామీద ఇంట్రెస్ట్ పోయిందనడానికి నిదర్శనం ఆ ప్రెస్‌మీట్‌కి హాజరు కాకపోవడమే! అయితే అల్లు అరవింద్ మాత్రం ఆ చిత్రాన్ని టేకప్‌చేసి, పూర్తి చెయ్యాలని అనుకుంటున్నాడు.

చూద్దాం! మెగాస్టార్ ఇంగ్లీష్ పిక్చర్ ఏమవుతుందో?

చిరంజీవి కొడుకు నటిస్తున్న 'మృగరాజు'

మెగాస్టార్ చిరంజీవి కొడుకు 'మృగరాజు' సినిమాలో ఓ ప్రత్యేక పాత్రను పోషిస్తున్నాడట. అయితే ఆ చిత్రం షూటింగ్ మాత్రం అత్యంత సీక్రెట్‌గా జరుగుతోందిట. పత్రికా ఫోటోగ్రాఫర్లను, ప్రెస్‌వాళ్ళకీ షూటింగ్ స్పాట్‌లో అనుమతి లభించడంలేదుట. కేవలం ఆ నిర్మాణ సంస్థ ఇచ్చే స్టిల్స్ వాడుకోవాలట. మరి మన మెగాస్టార్ ఈ ఆలోచన వెనక పరమార్థం ఏమిటో ఆయనకే తెలియాలి!

– విరాజి